పాతబస్తీకి మణిహారంగా 'బమ్కుక్‌నుద్దౌలా'

◄మరో 15 రోజుల్లో ప్రారంభానికి సన్నాహాలు ◄అభివృద్ధి పనులను పరిశీలించిన హైడ్రా కమిషనర్

హైదరాబాద్, డిసెంబర్ 2, ప్రభాతవార్త: పాతబస్తీకి మణిహారంగా చారిత్రక చెరువు బమ్కుక్‌నుద్దౌలా నిలుస్తుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. ఆక్రమణలతో ఆనవాళ్లను కోల్పోయిన ఈ చెరువు హైడ్రా పునరుద్ధరణతో పూర్వ వైభవాన్ని సంతరించుకుందన్నారు. తుదిమెరుగులు దిద్దుకుంటూ మరో 15 రోజుల్లో ప్రారంభానికి సిద్ధమౌతున్న బమ్కుక్‌నుద్దౌలా చెరువును హైడ్రా కమిషనర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చుట్టూ బండ్‌తో పాటు.. ఇన్‌లెట్లు, ఔట్ లెట్ల నిర్మాణాన్ని తనిఖీ చేశారు. చెరువుకు మూడు వైపులా నిర్మిస్తున్న ప్రవేశ మార్గాలను పరిశీలించారు. స్థానికంగా ఉన్నవారు సులభంగా చెరువు చెంతకు చేరేలా చూడాలని సూచించారు. నిజాంల కాలంలో ఈ చెరువుకు ఎంతో చరిత్ర ఉందని.. దానిని పునరావృతం చేసేలా.. చుట్టూ ఔషధగుణాలున్న మొక్కలతో పాటు.. చల్లటి నీడనిచ్చే చెట్లను నాటాలన్నారు. అన్ని వయసుల వారూ సులభంగా నడిచేలా వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని.. లైటింగ్ చెరువు చుట్టూ ఉండేలా చూడాలన్నారు. పిల్లల కోసం ప్లే ఏరియాలు, వృద్ధుల కోసం సీటింగ్ జోన్లు, ఓపెన్ జిమ్‌లు, పబ్లిక్‌బైళ్లు, పార్కులు వంటి సౌకర్యాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. సీసీటీవీ కెమేరాలను ఏర్పాటు చేసి.. హైడ్రా ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్ తదితరులు

ఇస్లామిక్ సంప్రదాయాలు ఉట్టిపడేలా....

ఇక్కడ ప్రజలు వచ్చి కూర్చునేందుకు వీలుగా నిర్మిస్తున్న గుమ్మటాల(గజబోలు)తో పాటు.. ప్రవేశ గేట్లు ఇస్లామిక్ సంప్రదాయాలు ఉట్టిపడేలా అభివృద్ధి చేయాలని రంగనాథ్ సూచించారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ చెరువును జాతి సంపదగా భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. ఆ క్రమంలోనే చెరువు ఆక్రమణలను గత ఏడాది ఆగస్టు నెలలో తొలగించినట్టు చెప్పారు. 4.12 ఎకరాలుగా మిగిలిపోయిన ఈ చెరువు ఆక్రమణలను తొలగించి పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడంతో 18 ఎకరాల మేర విస్తరించడమైదన్నారు. వరద కట్టడితోపాటు.. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని హైడ్రా కమిషనర్ చెప్పారు. ఈ చెరువు ఔట్‌లెట్ నుంచి వెళ్లే నీరు కిందకు పోయేలా.. కాలువలను అంతే సామర్థంతో నిర్మించాలని స్థానిక అధికారులకు సూచించారు. ఇప్పటికే రహదారుల విస్తరణతో పాటు నిర్మాణ పనులు చేపట్టామని జీహెచ్ ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి కమిషనర్‌కు వివరించారు.

హర్షం వ్యక్తం చేసిన స్థానికులు....

1770లో హైదరాబాదు మూడవ నిజాం సి కందర్ జాకు ప్రధానమంత్రిగా ఉన్న నవాబ్ రుక్నుఉద్‌దౌలా నిర్మించిన బమ్కుద్దౌలా చెరువు. ఈ చెరువులో వనమూలికల చెట్లు, కొమ్మలు వేసి.. ఆ దిగువన నిర్మించిన బావిలోకి ఔషధ గుణాలతో వచ్చిన ఊట నీటిని మాత్రమే నిజాంలు వినియోగించేవారని చరిత్రకారులు చెబుతున్నారు. అంతే కాదు.. ఈ చెరువు చుట్టు సువాసనలు వెదజల్లే పూల మొక్కలు విరివిగా ఉండేవని.. ఆ పూలన్నీ చెరువులో పడడంతో ఇక్కడి నీటిని సెంటు తయారీకి వినియోగించేవారని.. అరబ్ దేశాలకు ఇక్కడి నీరు తీసుకెళ్లే వారని కొంతమంది పేర్కొంటున్నారు. ఇలా ఎంతో చరిత్ర ఉన్న ఈ చెరువు మళ్లీ పునరుద్ధరణకు నోచుకోవడం చాలా ఆనందంగా ఉందని పలువురు సంబర పడుతున్నారు. పాతబస్తీలో ఇలాంటి అభివృద్ధి చాలా అవసరం. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించడం శుభ పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని హైడ్రా ఎంతో సమర్థవంతంగా పూర్తి చేసిందని కొనియాడారు. చారిత్రక చెరువు పునరుద్ధరణతో పాతబస్తీకి కొత్త వెలుగులు అందిస్తున్నారని కొనియాడారు.

హైదరాబాద్ వార్త

ఒక్కోల్యాబ్ ..ఒక్కోరకం

-ప్రైవేట్ డయాగ్నోస్టిక్స్ సెంటర్లలో దోపిడీ
-వాస్తవ ధరలకంటే రెండింతలు వసూలు
-ఒకేపరీక్షకు రెండుల్యాబ్‌లల్లో వేర్వేరు రిపోర్టులు
-తాము రాసిన దగ్గరికే వెళ్ళాలంటున్న డాక్టర్లు
-ఇబ్బందిపడుతున్న రోగులు

హైదరాబాద్, డిసెంబరు 2,ప్రభాతవార్త: ఉప్పల్ ప్రాంతానికి చెందిన నరేష్ ఆప్రాంతంలో పేరుమోసిన ఓప్రైవేట్ డయాగ్నోస్టిక్స్ సెంటర్ బ్రాంచిలో కాల్షియం టెస్ట్ చేయించుకుని ఆరిపోర్టును సికింద్రాబాద్‌లోని ఓకార్పొరేటర్ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడ ఆరిపోర్టులో కాల్షియం ఎక్కువగా ఉందని డాక్టర్ చెప్పారు. అయినప్పటికి రిపోర్టుపై అనుమానం వచ్చి అదేఆసుపత్రిలో టెస్ట్ చేయించగా రిపోర్టు నార్మల్‌గా వచ్చింది. దీంతో ఉప్పల్ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌లో చేయించిన రిపోర్టు తప్పుగా ఉందని డాక్టర్ నిర్ధారించారు. ఇది కేవలం ఒక నరేష్‌కే కాదు తరచూ నగరంలో వివిధ డయాగ్నోస్టిక్ సెంటర్లకు వెళ్తున్న రోగులకు జరగుతున్న సంఘటనలు.. ఒకేరకమైన టెస్ట్‌కు వివిధ డయాగ్నోస్టిక్ సెంటర్లలో వేర్వేరు రిపోర్టులు రావడంతో పలువురు రోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు రిపోర్టుల వల్ల మందులుతిని లేనిరోగాలు తెచ్చుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అడ్డగోలు రేట్లు..

ప్రైవేట్ ల్యాబ్‌ల నిర్వాహకులు వాస్తవ ఫీజుకంటే రెండు మూడు రెట్లు ఎక్కువగా వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. బాధితుల అవసరాన్ని భట్టి రేట్లు పెంచేస్తున్నారు. వాస్తవానికి ఏటెస్టుకు ఎంత వసూలు చేయాలనేది ఖచ్చితంగా బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ చాలా ల్యాబ్‌లలో అలాంటి బోర్డులు కనిపించడం లేదు. మరోవైపు ప్రైవేట్ ఆసుపత్రులకు వస్తున్న బాధితులను అక్కడి వైద్యులు ఖచ్చితంగా పలానా స్కానింగ్ సెంటర్‌కే వెళ్ళాలని రిఫర్ చేస్తున్నారు. మరికొన్ని ఆసుపత్రుల్లో తమకు కమిషన్లు వస్తాయని ఆంబులెన్స్‌లో తీసుకెళ్ళి చేయించుకుని తీసుకువస్తున్నారు. దీంతో గర్భిణీలు, రోగులు ఆర్థికంగా సతమతమవుతున్నారు.

కనిపించని రేడియాలజిస్టులు..

వాస్తవానికి ప్రతి ల్యాబ్, స్కానింగ్ సెంటర్లలో రేడియాలజిస్టు తప్పనిసరిగా ఉండాలి. రోగిని స్కానింగ్ తీసి సంబంధించిన రిపోర్టు ఆరేడియాలజిస్టు ద్వారానే అందజేయాలి. కానీ కొన్ని స్కానింగ్ సెంటర్లలో రేడియాలజీ డాక్టర్ పేరుతో ఒక క్యాబిన్, ఒక నేమ్‌బోర్డు ఏర్పాటు చేసి ఉంచుతున్నారు. కానీ అక్కడ డాక్టర్ మాత్రం కనిపించడు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఆ రేడియాలజిస్టు డాక్టర్ల పేర్లను, లెటర్‌ప్యాడ్‌లను వాడుకుంటూ వారికి కొంత సొమ్మును ముట్టచెప్పుతున్నారు. ఇలా టెస్టులు మాత్రం అవగాహన లేని సిబ్బందితో చేయిస్తూ రిపోర్టులు ఇచ్చి పంపుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిటీస్కానింగ్ సెంటర్లలో నిలువుదోపిడీ జరుగుతున్నా వైద్యఆరోగ్యశాఖ కన్నెత్తి చూడటం లేదు.

విద్యార్థులే దేశ భవిష్యత్..

-చదువుతో పాటు టెక్నాలజీలో ముందుండాలి -జిల్లా కలెక్టర్ హరిచందనా దాసరి

హైదరాబాద్, డిసెంబరు 2,ప్రభాతవార్త: విద్యార్థులలో సృజనాత్మకత, ఆవిష్కరణలు మరింత పెంపొందిస్తుందని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఇన్స్పిక్టర్ అవార్డ్స్ మానక్ ఎగ్జిబిషన్, జిల్లాస్థాయి బాల్ వైజ్ఞానిక ప్రదర్శన శ్రీహనుమాన్ వ్యాయామశాల పాఠశాల సుల్తాన్ బజార్ నందు జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ డాక్టర్ సురేఖ, మాజీ రాజ్య సభ సభ్యులు హనుమాన్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు వి హనుమంతరావు, సెక్రటరీ మైథిలి శరన్ జిల్లా కలెక్టర్ తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలు ద్వారా విద్యార్థుల భావనలు ప్రయోగశాలలో నేరుగా పాల్గొనటానికి అలాగే జ్ఞానాన్ని బలోపేతం చేయడానికి ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ అన్నారు. అలాగే విద్యార్థులు దేశ భవిష్యత్తు అని, చదువుతోపాటు టెక్నాలజీలో కూడా ముందుండాలని అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ప్రదర్శనలను తిలకించాలని,మంచి అవకాశం గా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సైన్స్ అంటే జీవితమని, భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని విద్యార్థులు జిల్లా స్థాయి నుండి రాష్ట్రస్థాయిలో రాణించి ఫలితాలు సాధించాలని విద్యార్థులను ఆకాంక్షించారు.

ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన, విహెచ్ తదితరులు

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం జరుగుతుందని అన్నారు. ఈప్రదర్శనలు చేపట్టి పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఈ జిల్లాస్థాయి ప్రదర్శనకు జ్యూరీలుగా వివిధ యూనివర్సిటీ ప్రొఫెసర్సుగా రావడం జరిగింది, జిల్లాస్థాయి ప్రదర్శన రెండురోజులు నిర్వహించడం జరుగుతుంది. ఈకార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ రోహిణి, డిప్యూటీ డిఇఓ వెంకటేశ్వర్లు, సైన్స్ అధికారి ధర్మేందర్, వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంచి పరిపాలనాదక్షుడు మర్రి చెన్నారెడ్డి

-మర్రి చెన్నారెడ్డి వర్ధంతి సభలో పాల్గొన్న పలువురు నేతలు

ముషీరాబాద్, డిసెంబర్ 2, ప్రభాతవార్త: మర్రి చెన్నారెడ్డి మంచి పరిపాలనాదక్షుడని, రాజకీయాలకు అతీతంగా మనమంతా ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు నేతలు కొనియాడారు. మంగళవారం మర్రి చెన్నారెడ్డి 29వ వర్ధంతి సందర్భంగా లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని మర్రి చెన్నారెడ్డి రాక్ గార్డెన్‌లో ఆయన సమాధి వద్ద అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి డి.కె.సమరసింహారెడ్డి, కౌన్సిల్ ఛైర్మన్ సుఖేందర్‌రెడ్డి, బీసీ కమీషన్ ఛైర్మన్ నిరంజన్, బండా ప్రకాష్, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి చంద్రశేఖర్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ తదితరులు పాల్గొని పుష్పగుచ్చాలు ఉంచి, శ్రద్ధాంజలి గడించారు. ఈ సందర్భంగా జాతీయ ప్రకృతి విపత్తుల నివారణ సంస్థ మాజీ ఛైర్మన్, మర్రి చెన్నారెడ్డి కుమారుడు మర్రి శశిధర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన వర్ధంతి సభలో వారు మాట్లాడుతూ తెలంగాణ స్ఫూర్తి ప్రదాత మర్రి చెన్నారెడ్డి పేదల కోసం, రైతుల కోసం ఎల్లప్పుడూ తపన పడేవారని, ఆయన సాగునీటి కోసం, విద్యాసంస్థల కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. బీసీల రిజర్వేషన్లకు ఆద్యుడని, నాలుగు పెద్ద రాష్ట్రాలకు గవర్నర్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా, పీసీసీ అధ్యక్షునిగా, మంత్రిగా ఎన్నో పదవులను స్వీకరించినప్పటికీ, ఎక్కడా ఎవ్వరికీ, ఏనాడూ తలవంచని అరుదైన వ్యక్తి మర్రి చెన్నారెడ్డి అని, ఆయనను మనం నేర్చుకోవల్సింది ఎంతో ఉందని కొనియాడారు. పార్టీలకు అతీతంగా అందరి మన్ననలు పొందిన రాజకీయ ఉద్ధండుడు మర్రి చెన్నారెడ్డి అని, ఆయన చరిత్ర నేటి యువత తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, బీజేపీ జిల్లా అధ్యక్షులు భరత్‌గౌడ్, స్థానిక బీజేపీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

మర్రి చెన్నారెడ్డి ఘాట్‌లో నివాళులర్పిస్తున్న పలువురు నేతలు

ఈ సందర్భంగా పేదలకు దుప్పట్ల పంపిణీ, ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు.

'ఆటో' ఇటో నిలిపితే చలానానే..!

- ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే

జూబ్లీహిల్స్, డిసెంబరు 2, ప్రభాతవార్తః ఆటోవాలాలపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించారు. ఇష్టారీతిన పార్కింగ్ చేసినా, ప్రయాణికులను ఎక్కించుకొనేందుకు ట్రాఫిక్ జాం చేసినా చర్యలు తీసుకొనేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం జూబ్లీహిల్స్ లో ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, పశ్చిమ మండల ఏసీపీ కట్టా హరిప్రసాద్‌లు జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో పర్యటించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో పెట్రోల్ పంప్ పక్కన ఉన్న స్థలంలో ఆటోలను వరుస క్రమంలో నిలపాలని ఆటో డ్రైవర్లకు సూచించారు. ఒక ఆటో ముందుకొచ్చి ప్రయాణికులను తీసుకెళ్లిన తరువాతనే మరో ఆటో రావాలని, అప్పటివరకు నిర్దేశించిన స్థలంలోనే ఆటోను నిలపాలని సూచించారు. అలా కాకుండా ఆటోలను ఇష్టారీతిన తీసుకొచ్చి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని, చలానా విధిస్తామని తెలిపారు. అలాగే అన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆటో నిలిపే ప్రాంతాలను సూచిస్తామన్నారు. తద్వారా ట్రాఫిక్‌కు ఏర్పడుతున్న ఇబ్బందులను తగ్గించే ప్రయత్నం చేస్తామని డీసీపీ తెలిపారు. ఆటో డ్రైవర్లు ఖచ్చితంగా డ్రెస్ కోడ్ పాటించాలని ఏసీపీ కట్టా హరిప్రసాద్ సూచించారు.

ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ కట్టా హరిప్రసాద్.

కార్మికుల వేతనాలు పెంచేంతవరకు పోరాటం

యూనియన్ నేత నర్సింహ్మా హెచ్చరిక

కింగ్‌కోటి ఆసుపత్రి ఎదుట నిరసన ధర్నా చేపట్టిన కార్మికులు

సైఫాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త: ప్రభుత్వ ఆసుప త్రులలో దశాబ్దన్నర కాలం గా పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటి కార్మికుల వేతనాలు ప్రభుత్వ పెంచేంతవరకు పోరాడుతామని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహ్మా హెచ్చరించారు. ఈ కార్మికులకు 2002 సంవత్సరంలో ఇంటిగ్రేటెడ్ హాస్పటల్ ఫెసిలిటి మేనేజ్మెంట్ సర్వీసెస్ కింది టెండర్లను ఆహ్వానించి జివొ నెంబరు 60 ప్రకారం వేతనాలు చెల్లించాలనే నిబంధన పొందుపరిచినప్పటికి కార్మికులకు ఆవేతనాలు అందకపోవడం దారుణమన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒక గంట సేపు నిరసన ధర్నా కార్యక్రమాన్ని వేలాది మంది కార్మికులు నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా కింగ్‌కోఠి, ఫీవర్ ఆసుపత్రులలో జరిగిన కార్మికుల ధర్నాలో ఆయన ప్రసంగించారు. కార్మికులకు 13, 600 రూపాయలు వేతనం రావాల్సి ఉండగా కేవలం 11 వేల రూపాయలు చెల్లించి కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికుల చట్టం ప్రకారం ఏడాదికి 4 పండుగ సెలవు, 4 జాతీయ సెలవు, 15 ఆర్జిత సెలవులు అమలు చేయవలి ఉన్నప్పటికి అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న ధరలకు అనుగుణంగా నూతన టెండర్లను ఆహ్వానించి కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇచ్చేవిధంగా నిబంధనను పొందుపరచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 4వ తేదీ వరకు రోజు ఒక గంట సేపు నిరసన ధర్నా నిర్వహిస్తామని, 5వ తేదీన కోఠిలో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పార్వతి సంతోషి, భాగ్యలక్ష్మి తదతరులు పాల్గొన్నారు.

నయనమనోహరం భాగ్యనగర్ జాతీయ నృత్యోత్సవం

నృత్యప్రదర్శనల్లో ఒక దృశ్యం

రవీంద్రభారతి, డిసెంబరు 2 ప్రభాతవార్త : శ్రీకీర్తి నృత్య అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో భాగ్యనగర్ జాతీయ నృత్యోత్సవాలు నమనమనోహరంగా జరిగాయి. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ నృత్యకళాకారులతో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారులు పాల్గొని కూచిపూడి, ఆంధ్రనాట్యం, కథక్, ఒడిస్సీ నృత్యరీతుల్లో తమ తమ అద్భుత నృత్యప్రదర్శనలతో తన్మయుల్ని చేశారు. డ్యాన్స్ ఇండియా ఫెస్టివల్ డైరెక్టర్ డా. విక్రమ్‌కుమార్ నేతృత్వంలో ప్రముఖ నాట్యగురు డా. సజని వల్లభనేని ఆధ్వర్యంలో ఈ నృత్యోత్సవాలు కనువిందు చేశాయి. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీత ఇలియానా సిటారిష్టిని మహాంకాళిమోహన్ జాతీయ స్మారక పురస్కారంతో; డా. దివ్యసేన (భరతనాట్యం, తమిళనాడు), శ్వేత వెంకటేష్ (కథక్, కర్ణాటక)లను మహాంకాళిమోహన్ జాతీయ యువపురస్కారాలతో ఘనంగా సన్మానించారు. డాన్స్ ఇండియా ఉత్తమ నృత్యసంచాలకులుగా మహారాష్ట్ర కళాకారిణి కశ్మీరా త్రివేదిని సత్కరించారు. భాగ్యనగర్ జాతీయ పురస్కారాలను డా. వనజా ఉదయ్, డా. వేలూరి సుమిత్ర, డా. కె.రత్నశ్రీ, డా. ఆర్.సుధాకర్, డా. విజయ్‌పాల్, డా. హెచ్.అనితలు స్వీకరించారు. భాగ్యనగర్ రాష్ట్రీయ పురస్కారాలతో ఎం.శ్రీవల్లి (లక్నో), తెలంగాణ కూచిపూడి నాట్యగురువులు అడపా భరణి, బాలాజీ, పేరిణి శ్రీనివాస్, క్రాంతికిరణ్, స్నేహ, లోక చంద్రశేఖర్‌రెడ్డి, డా. నళిని, శ్రీలత నారపరాజు, వసంత సంధ్యలను సన్మానించారు. ఈ వేడుకల్లో బిజెపి నేషనల్ కౌన్సిల్ సభ్యురాలు కె.గీతామూర్తి, ఐసిసిఆర్ జోనల్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, తెలుగు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. కోట్ల హనుమంతరావు, కళపత్రిక సంపాదకుడు డా. మహ్మద్‌రఫీ, డా. కళాకృష్ణ, డా. భాగవతుల సేతురామ్, బొప్పన నరసింహారావు తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా లోకచందు ఆంధ్రనాట్యం ప్రదర్శించగా మధ్యాహ్నం నుండి 20కిపైగా బృందాలు కూచిపూడి నృత్యాలతో అబ్బురపరిచారు.

కూతుర్ని ప్రేమిస్తున్నాడని విద్యార్థి ఇంటిపై బాలిక తల్లిదండ్రుల దాడి

-తీవ్ర మనస్థాపానికి గురై విద్యార్థి ఆత్మహత్య

బాచుపల్లి, డిసెంబర్ 2, ప్రభాతవార్త : ఒకే కళాశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థుల మధ్య సఖ్యత పెరగడంతో దానిని అపార్థం చేసుకున్న బాలిక తల్లిదండ్రులు బాలుడి ఇంటిపై దాడి చూశారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆ బాలుడు ఆత్మహత్య చేసుకొని మరణించాడు. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం ప్రగతి నగర్ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన వెంకటేష్, జ్యోతిల పెద్ద కుమారుడు మంజునాథ్ (18) ప్రగతి నగర్‌లోని ప్రగతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అదే కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ బాలికతో అతనికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయాన్ని బాలిక తల్లిదండ్రులు అనుమానించి ఆదివారం రాత్రి మంజునాథ్ ఇంటిపైకి వెళ్లి దుర్భాషలాడుతూ మంజునాథ్ తల్లిదండ్రులు, మంజునాథ్‌పై దాడి చేశారు. వారిని గాయపరిచారు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన మంజునాథ్ సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాలుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మంజునాథ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

కాచిగూడ డివిజన్ సమగ్రాభివృద్ధికి చర్యలు
-ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

మంచినీటి పైప్ లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

హైదరాబాద్ డిసెంబర్ 2 ప్రభాతవార్త : అంబర్ పేట్ శాసనసభ నియోజకవర్గం కాచిగూడ డివిజన్ సమగ్రాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం కాచిగూడ డివిజన్ వాల్మీకి నగర్‌లో రూ.4 లక్షల 50 వేల వ్యయంతో నిర్మించ తలపెట్టిన మంచినీటి పైప్ లైన్ పనులకు స్థానిక కార్పొరేటర్ కన్నా ఉమా రమేష్ యాదవ్ తో కలిసి శంకుస్థాపన చేసే కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం కృష్ణ, ఏఈ సూర్య , డివిజన్ అధ్యక్షులు భీష్మ దేవి , టీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఓం ప్రకాష్ యాదవ్ , బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

పేదల పెన్నిది ముఖ్యమంత్రి సహాయనిధి

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చెక్కులను పంపిణీ చేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్, డిసెంబర్ 2, ప్రభాతవార్త

పేదల పెన్నిధి ముఖ్యమంత్రి సహాయనిధి అని, నిరుపేదల ఆరోగ్య సంరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 129 డివిజన్ షాపూర్ నగర్ వాసులు టి. ప్రవళిక గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చికిత్స సరిపడా స్థోమత లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కొలన్ హన్మంత్‌రెడ్డిని సంప్రదించారు. ఆయన సానుకూలంగా స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రవళికకు రూ.2,50,000, అలాగే నిజాంపేటకు చెందిన పి.కీర్తికి రూ.20,000 మంజూరి చేయించారు. మంజూరైన ఆర్థిక సహాయాన్ని మంగళవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చెక్కుల రూపంలో ఇద్దరు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాంగ్రెస్ సిద్దనోల సంజీవరెడ్డి, లక్ష మ్ణ్, అజాం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బిసి జెఎసి కన్వీనర్‌గా భూంపల్లి అశోక్

రాష్ట్ర బిసి జేఏసీ కన్వీనర్ గా నియమితులైన భూంపల్లి అశోక్ దాదాని నియామకపత్రాన్ని అందిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య

చిక్కడపల్లి డిసెంబర్ 2 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర బిసి జేఏసీ కన్వీనర్ గా గజ్జిన్కర్ భూంపల్లి అశోక్ దాదా ను బిసి జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య నియమించారు. ఈ మేరకు మంగళవారం విద్యానగర్ లోని బీసీ భవన్ లో అశోక్ కు నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆరె కటిక అభివృద్ధి సంఘం లీగల్ అడ్వైజర్ కే సాయి దాదా. జాయింట్ సెక్రెటరీ జె శ్రీనివాస్ దాదా. చింటూ మొదలగువారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భూంపల్లి అశోక్ దాదా ను అభినందించారు.

లలితసంగీత సాహిత్యాంశంపై అధ్యయన శిబిరం

నాంపల్లి, డిసెంబరు 2 ప్రభాతవార్త : 20వ శతాబ్దంలో పుట్టి ఆకాశవాణి వంటి వేదికల ద్వారా వికాసం పొంది నేటికీ తెలుగు వారిని ఆలరిస్తున్న లలిత సంగీతంలో సాహిత్యాంశాన్ని విశ్లేషించి చూసే అధ్యయన శిబిరాన్ని తెలంగాణ సారస్వత పరిషత్తు డిసెంబరు 25న బొగ్గులకుంట, తిలక్‌రోడ్ సారస్వత పరిషత్తులోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో నిర్వహించ తలపెట్టింది. ప్రధానంగా ఆధునిక కాలంలో భావ, అభ్యుదయ కవిత్వ యుగాల్లో పేరెన్నికగన్న కవుల కలాలనుండి జాలువారి సంగీత దర్శకులచేత అద్భుత స్వరాలను కూర్చుకొని శ్రోతలను అలరిస్తూ ఉన్న లలితసంగీతంలో సాహిత్యాంశాన్ని పలువురు విద్యాంసులు సోదాహరణంగా విశ్లేషిస్తారని సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సాహిత్యం తెలిసి భావాన్ని గ్రహించి పాడడంలో యువతకు అవగాహన కల్పిస్తారు. ప్రముఖ గాయకుడు, సంగీత గురువు కె.రామాచారి సమన్వయకర్తగా వ్యవహరిస్తారని, ఈ నెల 20వ తేదీలోగా 30ఏళ్లలోపు వారు తమ వివరాలతో 9603727234 వాట్సాప్ నంబరులో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు జర్నలిస్టుల డిమాండ్ల సాధనకు 'మహా ధర్నా'

సమావేశంలో మాట్లాడుతున్న విరాహాత్‌ఆలీ

సైఫాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త: గత పుష్కరకాలంగా నిర్లక్ష్యానికి, నిరాధరణకు గురవుతున్న పాత్రికేయుల డిమాండ్లను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 3వ తేదీన 'మహా ధర్నా' కార్యక్రమాన్ని మాసాబ్‌ట్యాంక్‌లోగల రాష్ట్ర సమాచార భవన్ ఎదుట నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహాత్‌ఆలీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 గంటలకు మహా ధర్నా కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. గత కెసిఆర్ ప్రభుత్వ హాయంలో నిర్లక్ష్యానికి గురైన పాత్రికేయులు సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో కూడా ఆదే పరిస్థితి కొనసాగుతున్నదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పరిష్కారించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ మహా ధర్నాకు అన్ని జిల్లాల నుంచి జర్నలిస్టులు హాజరవుతున్నారని చెప్పారు. అక్రెడిటేషన్ పాలసీని వెంటనే ప్రారంభించాలని, ఆరోగ్య బీమా పథకాన్ని తక్షణమే పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు వై.నరేందర్‌రెడ్డి, కె.రాంనారాయణ, వి.యాదగిరి, శిగ శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అణు ఇంధన సంస్థలో ప్రైవేటుకు భాగస్వామ్యం కల్పించరాదు : సిపిఐ నేత విఎస్ బోస్

సైఫాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త: భారత దేశ ప్రతిష్టకు ప్రతీకగా నిలబడిన అణు ఇంధన సంస్థలో ప్రైవేటు వారికి భాగస్వామ్యం కల్పిస్తామని ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటన ఆనాలోచితమైన నిర్ణయమని, తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ డిమాండ్ చేశారు. దేశ ప్రతిష్టకు శాస్త్ర, సాంకేతిక రంగానికి ప్రతిబింభంగా అణు ఇంధన శాఖను నాటి ప్రధాని నెహ్రూ ప్రభుత్వం అనేక విదేశీ రాజకీయ వత్తిడీలను ఎదిరించి అణు ఇంధన కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. తర్వాత కాలంలో ఆ కమిషన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ (డిఎఇ) పేరుతో బొంబాయి మహానగంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హోమి జేబాబా, శాంతి స్వరూప్, భట్నాగర్, డిఎన్ వాడియా లాంటి అనేక మంది సైంటిస్టులతో కలిసి అహోరాత్రులు కష్టపడి డిఎఇ సంస్థను ప్రపంచ వ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు గల సంస్థగా తీర్చిదిద్దడం జరిగిందని ఆయన వివరించారు. అణు ఇంధన్ సంస్థను స్థాపించడం గిట్టని అనేక పెట్టుబడి దారి దేశాలు ఆ సంస్థ మూల పురుషుడైన ఓమిజే బాబాను విమాన ప్రమాదంలో చంపారన్నది నేటికి పరిష్కారం కాని సంఘటన్నారు. తరువాత విక్రమ్ సారాబాయ్, సివి రామన్, డా.ఎఎస్‌రావు లాంటి అణు శాస్త్రవేత్తలు మరింతగా అభివృద్ధి చేసి అనేక రాష్ట్రాల్లో అణు ఇంధనంతో నడిచే విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి దేశానికి కావాల్సిన విద్యుత్ అతి తక్కువ ఖర్చుతో ప్రజలకు అందించారని తెలిపారు.

భారతీయ శాస్త్రవేత్తల కృషి, త్యాగాలతో ఏర్పడి అభివృద్ధి పథంలో నడుస్తున్న అణు ఇంధన సంస్థల్లో స్వార్థపరులు, అవినీతిపరులు, దేశంకన్నా లాభాలే ఎక్కువగా భావించే ప్రైవేటు వారికి ఈ సంస్థలో భాగస్వామ్యం కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ద్రోహపూరిత చర్యని బోస్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ అనాలోచిత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌ను త్వరగా పూర్తి చేయండి : కార్పొరేటర్ దొడ్ల

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 2, ప్రభాతవార్త : ఆల్విన్ కాలనీ డివిజన్లో జరుగుతున్న మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందివ్వాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సూచించారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పిజెఆర్ నగర్‌లో రెండు కోట్ల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులలో భాగంగా నిర్మిస్తున్న మొదటి అంతస్తు స్లాబు నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎం.సి అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పీజేఆర్ నగర్ కాలనీలో నిర్మిస్తున్న మల్టి పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులలో భాగంగా మొదటి అంతస్తు స్లాబ్ నిర్మాణాన్ని నాణ్యత ప్రమానాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు తెలియచేసారు. పీజేఆర్ నగర్ కాలనీ వాసుల చిరకాల కోరిక త్వరలోనే నెరవేరుతుందని, అందరికి ఆమోదయోగ్యమైన ఫంక్షన్ హాల్‌ను అన్ని హంగులతో సకల సౌకర్యాలతో నిర్మిస్తామని కార్పొరేటర్ తెలియచేసారు. ఫంక్షన్ హాల్ పేద మధ్య తరగతి ప్రజలకు ఇక్కడి పరిసర ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియచేసారు. ఫంక్షన్ హాల్‌లో వివాహాది శుభకార్యాలు, సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్‌లు జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా ఫంక్షన్ హాల్ ఉపయోగపడుతుందని అన్నారు. ఫంక్షన్ హాల్, చిల్డ్రన్ పార్క్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఇ శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, యాదగిరి, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

సైబరాబాద్ ప్రతినిధి, డిసెంబరు 2 ప్రభాతవార్త

రెసిడెన్షియల్ కాలనీలో ఓ వైన్‌షాపు కోసం నిర్మిస్తున్న అక్రమ షెడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవాలని, అక్రమ నిర్మాణాన్ని వెంటనే కూల్చివేయాలని కోరుతూ శేరిలింగంపల్లి జోనల్ కమీషనర్‌కు రాజరాజేశ్వరీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పిర్యాదు చేశారు. జోనల్ కమీషనర్‌కు పిర్యాదు చేసిన సందర్భంగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని కొండాపూర్ రాజరాజేశ్వరీనగర్ కాలనీలో నివాస గృహాల మధ్య ఓ అక్రమ షెడ్డు నిర్మాణం కొనసాగుతుందని తెలిపారు. సదరు షెడ్డులో ఓ వైన్‌షాపు ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు అక్రమ షెడ్డు నిర్మాణం చేపడుతున్నారని తెలిసిందని వాపోయారు. సదరు షెడ్డుకు ఎటువంటి అనుమతులు లేవని తెలిసిందని, సర్కిల్ పరిధిలోని కొంతమంది అధికారుల అండదండలతో అక్రమంగా షెడ్డు నిర్మాణాన్ని నిర్వాహకులు కొనసాగిస్తున్నారని వాపోయారు. రాజరాజేశ్వరీ నగర్ కాలనీలోని రెసిడెన్షియల్ జోన్‌లో నిర్మిస్తున్న ఈ అక్రమ నిర్మాణంలో వైన్‌షాపు ఏర్పాటు చేస్తే కాలనీ ప్రజల భద్రతకు తీవ్ర ఇబ్బందులు తప్పవని, దీన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరారు. వెంటనే జీహెచ్ఎంసీ అధికారులు స్థానికంగా కాలనీలో పర్యటించడంతో పాటు అక్రమ నిర్మాణం మీద విచారణ చేపట్టాలని సూచించారు. ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ షెడ్డు నిర్మాణాన్ని అడ్డుకోవడంతో పాటు ఇప్పటి వరకు చేపట్టిన నిర్మాణాన్ని పూర్తిగా కూల్చివేయాలని కోరారు. జోనల్ కమీషనర్‌ను కలిసిన వారిలో రాజరాజేశ్వరీ నగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు ఉన్నారు.

నిర్మాణంలో ఉన్న అక్రమ షెడ్డు

హత్య కేసులో నలుగురికి యావజ్జీవ కారాగార శిక్ష

జీడిమెట్ల, డిసెంబర్ 2, ప్రభాతవార్త

సైబరాబాద్ కమీషనరేట్, సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో జరిగిన ఆంజనేయులు హత్య కేసులో నిందితులు జార్పటి మైసయ్య, గంగరాజు గంగులు, యాదమ్మ, మార్కండేయ మనోజ్ కుమార్, చింటూ, శివలకి కోర్టు జీవిత ఖైదు శిక్షను విధించిందని సైబరాబాద్ క్రైమ్స్ డిసిపి ఎ. ముత్యంరెడ్డి తెలిపారు. రాత్రి 3 గంటలకు ఫిర్యాదురాలు, ఆమె కుటుంబ సభ్యులు మైసయ్య ఇంటికి చేరుకొనగా ఆంజనేయులు గాయాలతో రక్తపు మడుగులో మృతిచెంది కనిపించాడు. మూడు నెలల క్రితం మైసయ్య భార్య యాదమ్మ మృతిపై అనుమానంతో పథకం ప్రకారం నిందితులు హత్యకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాత్రి 3 గంటలకు ఆమె కుటుంబ సభ్యులు మైసయ్య ఇంటికి చేరుకొనగా ఆంజనేయులు గాయాలతో రక్తపు మడుగులో మృతిచెంది కనిపించాడు. మూడు నెలల క్రితం మైసయ్య భార్య యాదమ్మ మృతిపై అనుమానంతో పథకం ప్రకారం నిందితులు హత్యకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా సూరారం హెడ్ కానిస్టేబుల్ కేసు నమోదు చేసి ఇన్‌స్పెక్టర్ పి.రమణ రెడ్డికి దర్యాప్తు అప్పగించారు. కీలక ఆధారాలు సేకరించిన ఇన్విస్టిగేషన్ ఆఫీసర్, 13.08.2021న నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. సిసిఎల్ జార్పటి ప్రవీణ్‌ను జువెనైల్ జస్టిస్ బోర్డుకు హాజరు చేశారు. దర్యాప్తు పూర్తిచేసిన అనంతరం చార్జ్ షీట్ దాఖలు చేశారు. సాక్ష్యాలు, వాంగ్మూలాలు పరిశీలించిన తర్వాత మేడ్చల్‌లోని గౌరవనీయ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జి.భానుమతి నలుగురు నిందితులకు శిక్షలు ఖరారు చేశారు.

హత్యకు సంబంధించి నిందితులకు జీవితఖైదు, రూ.1000 జరిమానా విధించారు. 364 సెక్షన్ కింద 10ఏళ్లు కఠిన కారాగా శిక్ష రూ.500 జరిమానా విధించారు. అలాగే 34 సెక్షన్ కింద 6 నెలలు ఆర్ఐ, రూ.500 జరిమానా విధించారు.

శ్రీమద్ భగవద్గీత మానవ జీవితానికి దివ్యమైన మార్గదర్శనం

ధార్మిక సమ్మేళనంలో పాల్గొన్న బి.వి.విష్ణు మహారాజ్, భక్తులు

చార్మినార్, డిసెంబరు 2 ప్రభాతవార్త : శ్రీ మద్ భగవద్గీత మానవ జీవితానికి దివ్యమైన మార్గ దర్శనమని అఖిల భారతీయ శ్రీ చైతన్య గౌడియా మఠం ప్రధానాచార్యులు బి.వి.విష్ణు మహారాజ్ అన్నారు. హైదరాబాద్ పాతబస్తీ దివాన్‌దేవిడిలోని శ్రీ చైతన్య గౌడియా మఠంలో మూడు రోజుల పాటు జరుగుతున్న ధార్మిక సభలలో ఆయనపాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వ్యక్తి క్రోధం, అహంకారాన్ని విడిచి పెట్టాలని తెలిపారు. ప్రొఫెసర్ ఏ.రాములతో పాటు అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. బుధవారంతో విశేష్ ధార్మిక సమ్మేళనం పూర్తి అవుతుందని నిర్వాహకులు తెలిపారు.

జూబ్లీహిల్స్‌లో వైద్యుడి ఇంట్లో చోరీ

జూబ్లీహిల్స్, డిసెంబరు 2, ప్రభాతవార్తః

జూబ్లీహిల్స్‌లో ఒక వైద్యుడి ఇంట్లో చోరి జరిగింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌లో నివసించే విశ్రాంత ఉద్యోగి డాక్టర్ మోర్ల సురేష్ రాయ్(68) గత నెల 25న నార్కట్‌పెల్లికి, అనంతరం తిరుపతికి వెళ్లి వచ్చారు. సోమవారం నగరానికి తిరిగివచ్చిన ఆయన ఇంటికి వెళ్లి చూడగా ఇంట్లోని అల్మారాలో పెట్టిన దాదాపు 50 తులాల వెండితో పాటు పురాతనమైన నాణాలు, జర్మన్ సిల్వర్‌కు చెందిన ఆభరణాలు కనిపించలేదు. దీంతో వైద్యుడు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ సాహిత్య అకాడమీ
బాలలదినోత్సవ పోటీల విజేతల ప్రకటన

రవీంద్రభారతి, డిసెంబరు 2 ప్రభాతవార్త :

బాలల్లో సృజ న్మాతకతను వెలికితీసేందుకు తెలంగాణ సాహిత్య అకాడ మీ గత నెలలో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వ హించిన కవితలు, కథలు, పద్యాలు, నాటికల పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల బాలబాలికలు మనల్ని నిత్యం పీడిస్తున్న కాలుష్యం, కల్తీ, పతనమౌతున్న మానవసంబం ధాలు, విద్య ఆవశ్యకతను చెబుతూ విద్యార్థులు రాసిన రచనలు మన తెలంగాణ ప్రభుత్వ ఆలోచనలకు అద్దంపడు తూ రైజింగ్ తెలంగాణకు దర్పణం పడుతున్నాయని కొని యాడుతూ, బాలసాహిత్యంలో నిపుణులైన న్యాయనిర్ణేతల ఎంపికమేరకు ఆయా ప్రక్రియల్లో విజేతల వివరాలు ప్రకటించారు.

కవితా విభాగంలో ప్రథమ బహుమతి : భాషబోయిన ఈక్షిత, ద్వితీయ : టి.ధనుష్, తృతీయ : గూడూరు అరవ్‌రెడ్డి-3ప్రోత్సాహ బహుమతులు; నాటికల విభాగంలన ప్రథమ : ఎం.యశశ్రీ, ద్వితీయ : జె.వైష్ణవి, తృతీయ : బండారు అక్షయ-3 ప్రోత్సాహ బహుమతులు; పద్య కవితల విభాగంలో పసునూరి దివ్యజ్యోతి, ద్వితీయ : ఎ. శ్రీనివాస్, తృతీయ : జి.సహస్ర భారతి, 3 ప్రోత్సహ బహుమతులు; కథా విభాగంలో ప్రథమ : సుంకరబోయిన సంజన, ద్వితీయ : చనగాని సాత్విక, తృతీయ : (ఇద్దరు) కె.సాధన, టి.రిత్విక్‌తేజ, 8 ప్రోత్సాహ బహుమతులకు ఎంపికైన వారిలో ఉన్నారని డా. నామోజు బాలాచారి వెల్లడించారు.

బిపిసిఎల్ అవార్డు అందుకున్న శశాంక్ తివారీ

యాకుత్‌పుర, డిసెంబరు 2 ప్రభాతవార్త :

హైదరాబాద్ పాతబస్తీ సుల్తాన్‌షాహి ప్రాంతానికి చెందిన శశాంక్ తివారికి బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో బిపిసి ఎల్ అవార్డు లభించింది. ఆల్ ఇండియా బిపిసిఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ శుభంకర్ సేన్ చేతుల మీదుగా శశాంక్ తివారి అవార్డును అందుకున్నారు. పాతబస్తీలోని బల్దియా పెట్రోల్ పంపు పార్టనర్ నిర్వాహకులుగా బిపిసిఎల్ అవార్డు శశాంక్ తివారికి లభించింది.

దుర్గాభవానీనగర్ బస్తీలో సర్వే.

జూబ్లీహిల్స్, డిసెంబరు 2, ప్రభాతవార్తః

జూబ్లీహిల్స్ డివిజన్ రోడ్ నంబరు 5/7లోని దుర్గాభవానీ నగర్‌లో మంగళవారం రెవెన్యూ అధికారులు సెస్ సర్వే నిర్వహించారు. దుర్గాభవానీ నగర్‌లో నివసిస్తున్న వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇప్పటికే హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు లేఖలు రాశారు. ఈ క్రమంలోనే బస్తీలో సర్వే నిర్వహించాలని షేక్‌పేట తహసిల్దార్ కార్యాలయానికి కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఈ మేరకు తహిసిల్దార్ అనితారెడ్డి సూచనల మేరకు ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, వీఆర్వో మురళీ, అనిరుద్‌ల ఇక్కడ సర్వే నిర్వహించారు. దాదాపు 150కిపైగా కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నట్లు గుర్తించారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు మామిడి నర్సింగ్‌రావు, బస్తీ అధ్యక్షుడు గౌడ నాయక్, ప్రధాన కార్యదర్శి జాని నాయక్ తదితరులు ఇక్కడ పాల్గొన్నారు.

బస్తీలో సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు, చిత్రంలో మామిడి నర్సింగ్‌రావు తదితరులు ఉన్నారు.

లక్ష మందికి మొబైల్ స్క్రీనింగ్ మా లక్ష్యం
- గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్

జూబ్లీహిల్స్, డిసెంబరు 2, ప్రభాతవార్తః

మొబైల్ స్క్రీనింగ్ ద్వారా లక్ష మంది జీవితాలను స్పృశించడం తమ లక్ష్యమని గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. చిన్నబాబు సుంకవల్లి తెలిపారు. ఈ నెల 4న దసపల్లా హోటల్‌లో 12వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా మేఘాలయ, త్రిపుర ప్రభుత్వాలతో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ అవగాహన ఒప్పంద ప్రతాలు మార్చుకోనున్నట్లు వివరించారు. ఒప్పందం అనంతరం ఫిబ్రవరి 2026 నుండి క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాలను ప్రారంభిస్తామన్నారు. క్యూర్, కేర్, కంపాషన్ అనే సిద్ధాంతంతో క్యాన్సర్ బాధను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని, గత 12 సంవత్సరాల్లో 130 దేశాల్లో 1.4 కోట్ల మందికి గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సేవలు అందిచామన్నారు. వార్షికోత్సవానికి హైడ్రా కమిషనర్ ఎ. వి. రంగనాథ్, విశ్రాంత ఐఏఎస్ డా. శైలేంద్ర కుమార్ జోషి, బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ పాల్గొంటున్నారు. ఇండియాలో క్యాన్సర్ కేసులు ఆందోళనకరంగా మారుతున్నాయని, 2023లో 16 లక్షలకు పైగా కేసులు నమోదుకాగా 2025 నాటికి మరో 12.8శాతం పెరిగే అవకాశం ఉందన్నారు. ఉచిత మొబైల్ స్క్రీనింగ్ ద్వారా క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు, హృదయ సంబంధిత సమస్యలు వంటి చికిత్స అవసరమైన నాన్ కమ్యూనికబుల్ డిసీస్ కోసం లక్ష మందిని చేరుకోవడం తమ లక్ష్యమని అన్నారు.

డాక్టర్ కావడి ఎల్లయ్యకు గ్లోబల్ హెల్త్‌కేర్ అవార్డ్

అవార్డును చూపుతున్న డాక్టర్ కావలి ఎల్లయ్య

జూబ్లీహిల్స్, డిసెంబరు 2, ప్రభాతవార్తః

మలేషియాలో జరిగిన అంతర్జాతీయ అవార్డుల సదస్సు-2025లో నగరానికి చెందిన ప్రముక వైద్య నిపుణుడు, సాహిత్యవెత్త డాక్టర్ కావడి ఎల్లయ్యకు గ్లోబల్ హెల్త్‌కేర్ అవార్డును అందుకున్నారు. అత్యుత్తమ వైద్యసేవలు, సామాజిక సహకారానికి ఆయనకు ఈ అవార్డును అందించారు. 85 ఏళ్ల వయసున్న ఎల్లయ్య పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. 1941లో మహబూబ్‌నగర్‌లో జన్మించిన ఆయన 1967లో గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రభుత్వ ఆరోగ్య సంక్షరణలో మూడు దశాబ్దాలకు పైగా సేవలందించి 1998లో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం సైదాబాద్ ప్రాంతంలో నివసిస్తున్న ఆయన మాధన్నపేట ప్రాంతంలో క్లీనిక్ ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. కాగా ఆయన అందుకున్న అవార్డులను మంగళవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రదర్శించారు.

దక్షిణ మండలం డిసిపిని కలిసిన వస్త్రవ్యాపార సంఘాల ప్రతినిధులు

డిసిపి కిరణ్ ఖరే ప్రభాకర్‌ను కలిసిన వస్త్రాల వ్యాపార అసోసియేషన్ ప్రతినిధులు

చార్మినార్, డిసెంబరు 2 ప్రభాతవార్త : దక్షిణ మండలం డిసిఎగా ఇటీవల పదవి బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌ఖరే ప్రభాకర్‌ను ది హైదరాబాద్ కటోపీస్ క్లాథ్ మర్చంట్స్ అసోసియేషన్, హైదరాబాద్ హోల్ సేల్ ఆర్ట్ సిల్క్‌క్లాథ్ మర్చంట్స్ అసోసియేషన్‌లకు చెందిన ప్రతినిధులు, పలువురు వ్యాపారులు మర్యాద పూర్వకంగా కలిశారు. వస్త్రాల వ్యాపారులు డిసిపి కిరణ్ ఖరే ప్రభాకర్‌ను శాలువ కప్పి సన్మానించారు. వ్యాపారులు తమ సమస్యలనుడిసిపి కిరణ్ ఖరే ప్రభాకర్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా డిసిపి కిరణ్ ఖరే ప్రభాకర్ మాట్లాడుతూ వ్యాపార మార్కెట్లలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చ

పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్

5వ వార్డు గాంధీ నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,డిసెంబర్ 2 ప్రభాతవార్త:
కంటోన్మెంట్‌లోని వివిధ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. బస్తీ పర్యటనలో భాగంగా 5వ వార్డు గాంధీ నగర్, వాల్మీకి నగర్ పరిసర ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.గాంధీ నగర్‌లో అర్ధాంతరంగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు విడుదల చేసి అదనపు ఫ్లోర్‌లు వేయిస్తామన్నారు. మంచినీటి బోర్డు అవసరమైన చోట వేయిస్తామన్నారు. డ్రైనేజీ, విద్యుదంటి సమస్యలను మెరుగుపరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు పెద్దాల నర్సింహ్మ, సంకి రవిందర్, సంతోష్, సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్త, బస్తీ నాయకులు సాయి, బిక్షపతి, విష్ణు, గంట రాజు, మల్లప్ప, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ బోర్లను సీజ్ చేయాలి : నక్క మధు

అనుమతిలేని బోర్లను సీజ్ చేయాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్ననమాల సంఘం ప్రతినిధులు నక్క మధు, ఆర్.మల్లేశ్ తదితరులు

అడ్డగుట్ట,డిసెంబర్ 2 ప్రభాతవార్త: అడ్డగుట్ట డివిజన్‌లోని ప్రధాన రోడ్డు మార్గంలో అనుమతులు లేకుండా బహుళ అంతస్థులు నిర్మించేందుకు సన్నాహాలు చేయడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా వేస్తున్న బోర్లను సీజ్ చేయాలని అడ్డగుట్ట జై బీమ్ మాల సంఘం నేతలు ఆర్.మల్లేశ్,నక్క మధుల ఆధ్వర్యంలో మంగళవారం మారేడ్‌పల్లి తహశీల్దార్ అసదుల్లా ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నక్క మధు మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో అతి పెద్ద మురికివాడగా పేరొందిన అడ్డగుట్టలో మంచినీటి కోసం చిన్న బోర్లు వేస్తేనే రెవెన్యూ అధికారులు బెదిరించి భయభ్రాంతులకు గురి చేస్తారు. అయితే అడ్డగుట్ట ప్రధాన రోడ్డు మార్గంలో 7 హిల్స్ వారాహి కన్‌స్ట్రక్షన్ పేరుతో స్థల యజమాని అనుమతి లేకుండా భవన నిర్మాణం చేపట్టడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా 6.50 అడుగుల (పెద్ద బోరు) వేస్తున్నారని, ఈ విషయంపై రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాల సంఘం నాయకులు సత్యనారాయణ, రాంచందర్, రమాదేవి,జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వాములకు బిక్ష

స్వాములకు భిక్ష కార్యక్రమంలో పాల్గొన్న స్వాములు, దాతలు

కూకట్‌పల్లి, డిసెంబర్ 2, ప్రభాతవార్త :
కూకట్‌పల్లిలోని ఏపీబి పురంలో గల శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వాములకు ప్రతిరోజు బిక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే మంగళవారం బిక్ష పెట్టినటువంటి దాతలు ఏ. వాసు,డి. నాగరాజు, ఏ. పాపారావులు కుటుంబ సభ్యులతో భక్తులకు స్వాములకు భిక్ష ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాకులు దాతలను ఘనంగా సన్మానించి వాళ్ళు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాం అని పేర్కొన్నారు.

గోవులను అక్రమంగా కబేలాకు తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి

ఫిర్యాదు చేస్తున్న బిజెపి శ్రేణులు

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 2, ప్రభాతవార్త :
జయ నగర్‌లోని ఎల్లమ్మ చెరువును కేంద్రంగా చేసుకొని కొంతమంది గోవులను కబేలాలకు తరలిస్తున్నా ముఠాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కూకట్‌పల్లి బిజెపి ఇంచార్జ్ మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు కూకట్‌పల్లి సిఐకి ఫిర్యాదు చేశారు. జయ నగర్‌కు ఆనుకొని ఉన్న ఎల్లమ్మ చెరువు కేంద్రంగా చేసుకొని కొంతమంది గంగిరెద్దుల మాదిరి ముసుగు వేసుకొని గోవుల వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఎల్లమ్మ చెరువు ఎఫ్ కే ఎల్ ప్రాంతంలో గుడిసెలు వేసుకొని పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆవులను గోవులను మాయం చేస్తూ రాత్రికి రాత్రి కబేలాలకు తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక్కడి పరిసర ప్రాంతాల్లో ఉన్న గోశాలల నుండి ఆవులు దూడలు మాయమవుతున్నాయని తీరా యజమానులు వచ్చి ఇక్కడ చూస్తే దాదాపు 40కి పైగా ఆవులు దూడలు ఎల్లమ్మ చెరువు ఎఫ్‌టిఎల్ స్థలంలో కనిపించాయని చెప్పారు. ఫిర్యాదు చేసిన వారిలో మాధవరం కాంతారావు, వీరమల్ల కేశవరావు, వంశీ రెడ్డి, జి శ్రీకర రావు, పవన్ రావు, నర్సింగరావు, రేపన్ రాజు, శివకుమార్ తదితరులు ఉన్నారు.

రచయిత్రి తెన్నేటి సుధ మృతి పట్ల ప్రముఖుల సంతాపం

తెన్నేటి సుధాదేవి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రేలంగి నరసింహా రావు, రామ సత్యనారాయణ, కె.ధర్మారావు తదితరులు

చిక్కడపల్లి డిసెంబర్ 2 ప్రభాతవార్త : ప్రముఖ రచయిత్రి, తెలుగు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ డా.తెన్నేటి సుధ మరణం పట్ల ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహా రావు, శతాధిక చిత్రాల సినీ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, ఫాస్ ఫిలిం సొసైటీ అధ్యక్షులు సంస్కృతి రత్న డా.కె. ధర్మారావు లు , దివంగత సుధాదేవి నివాసానికి చేరుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె భర్త శిరోమణి వంశీ రామరాజు కు తమసంతాపాన్నితెలిపారు. విచేసిన వారందరూ వంశీ సంస్థ నిర్వాహించిన,పలు అగ్ర సినీ విశ్లేష, సన్మాన ,సత్కార అవార్డులు కార్యక్రమాల లో డా.తెన్నేటి సుధ విశేష కృషిని ప్రశంసిస్తూ, ఆమె లేని లోటు తీర్చ లేని దని ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు

'నార్ల' గొప్ప హేతువాది : ఆచార్య మృణాళిని

జూబ్లీహిల్స్, డిసెంబరు 2, ప్రభాతవార్తః
డా. బీ. ఆర్. అంబేడ్కర్ ఓపెన్ యునివర్సిటిలో ప్రముఖపాత్రికేయులు, సంపాదకులు నార్ల వెంకటేశ్వర రావు జయంతి సందర్భంగా నార్ల స్మారకోపాన్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగు విశ్వవిద్యాలయ మాజీ విభాగాధిపతి, ఆర్య విశ్వవిద్యాలయం, సిలికాంధ్ర (అమెరికా) ఆచార్యులు, ప్రొ.సి.మృణాళిని హాజరై నార్ల సాహిత్య రచనలువిశ్లేషణ అనే అంశంపై ఉపన్యాసం చేశారు. ప్రొ. మృణాళిని మాట్లాడుతూ నార్ల ఒక పాత్రికేయులే కాకుండా ప్రముఖ తెలుగు రచయిత అని, గొప్ప నాటక రచయిత అని అన్నింటికీ మించి అసమానతల పట్ల సమాజాన్ని జాగృత పరిచే గొప్ప ఆలోచనాపరులు అని అన్నారు. నార్ల వాస్తవిక నాటకాలు, నిశితమైన సామాజిక విమర్శ, తెలుగు సాహిత్యానికి గొప్ప వరమని అన్నారు. మానవ విలువలు, హేతువాదం, సామాజిక అన్యాయాలను విమర్శించడంపై ఆయన రచనలు ప్రజలను ఆలోచింపజేశాయని వివరించారు. నార్ల సాహిత్య రచనల్లో సీతా జోస్యం, నరకంలో హరిశ్చంద్ర, జాబాలి, పాత కోతవంటి తెలుగు వేదికకు వాస్తవిక భావాన్ని తీసుకువచ్చిన ఏకపాత్ర నాటకాల రచనలకు ఆయన ప్రత్యేకంగా ప్రసిద్ధి చెందారన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో నార్ల లాంటి

స్మారకోపన్యాసంలో మాట్లాడుతున్న ఆచార్య మృణాళిని. చిత్రంలో ఘంటా చక్రపాణి తదితరులున్నారు.

పాత్రికేయులు సమాజానికి చాలా అవసరం అన్నారు. విలువలతో కూడిన పాత్రికేయం ఆదర్శంగానిలుస్తుందని పేర్కొన్నారు. నార్ల గొప్ప తాత్వికవేత్త అని తెలిపారు. తన రచనలతో సమాజంలో జరిగే అన్యాయాల పట్ల, సామాజిక సమస్యల పట్ల నిత్యం ప్రజలను అప్రమత్తం చేసేవారని వివరించారు. నార్ల కుటుంబ సభ్యులు జ్ఞానసంపదను ఆయనరాసిన, సేకరించిన పుస్తకాలను అంబేడ్కర్ ఓపెన్ యునివర్సిటిలో లైబ్రరీకి అందించడం గర్వకారణంగా వీసీ ఆచార్య. ఘంటాచక్రపాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. యల్. విజయాకృష్ణా రెడ్డి, లైబ్రరీ ఇన్‌చార్జ్ ప్రొ. ఎన్. రజని, అన్ని విభాగాల అధిపతులు, డీన్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు. అంతకుముందు నార్ల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి -జంపనప్రతాప్

కంటోన్మెంట్ పారిశుధ్య కార్మికులను అభినందిస్తున్న జంపనప్రతాప్

కంటోన్మెంట్,డిసెంబర్ 2 ప్రభాతవార్త: ప్రజల ఆరోగ్య సంరక్షణకు పరసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని ప్రధాన రోడ్లపై ఉన్న డస్ట్ బిన్‌లను తొలగించి చెత్త వేయకుండా చర్యలు చేపట్టడంతో బస్తీలు, కాలనీలను పరిశుభ్రంగా ఉంచుతున్నందుకు వారిని జంపన శాలువకప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దఫేదార్ రామక్రిష్ణ, నాయకులు దుర్గయ్య, ప్రేమ్ ముదిరాజ్, కరన్ సింగ్, సాయి బాబా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

మెరుగైన వైద్యానికి ఎల్.ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,డిసెంబర్ 2 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ సూచించారు. 3వ వార్డు బాలంరాయికి చెందిన మధు సూదన్ రెడ్డి భార్య నివేదిత రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుంది. మెరుగైన వైద్యానికి నిమ్స్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకునేందుకు మంజూరైన రూ.2 లక్షల ఎల్ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దర్గ రవి, పరమేశ్‌లు పాల్గొన్నారు.

ప్రజలకు ఆటంకాలు కలుగకుండా లిక్కర్ షాప్‌లు నెలకొల్పాలి

కంటోన్మెంట్ బోర్డు మెంబర్ నర్మధకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

కంటోన్మెంట్,డిసెంబర్ 2 ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం లిక్కర్ పలాసీ ప్రకారం నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాల వల్ల కాలనీ వాసులకు, ట్రాఫిక్‌కు,అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా వాటి నిర్వాహనకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కంటోన్మెంట్‌లోని పలు కాలనీ వాసులు మంగళవారం నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధకు వినతిపత్రం అందజేశారు.

నిర్విరామ భక్తి గానలహరి

గాయనీమణులు సత్కరించిన దృశ్యం

చిక్కడపల్లి డిసెంబర్ 2 ప్రభాతవార్త : శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా దీక్షితులు కళా వేదిక పై మధురమ్యూజికల్ ఈవెంట్స్ నిర్వాహణలో కొణిదల రాధ అరుణ పింగళి ద్వయం పోటా పోటీగా సినీ భక్తి గీతాలుతో పాటు కొన్ని ఎంపీక చేసుకున్న కీర్తనలు మధురంగా ఆలపించారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఇరువురు గాయనీ మణులు పన్నెండు గంటల పాటు నిర్విరామ భక్తి గాన లహరి తో శ్రోతలను తన్మయులను చేశారు కీ బోర్డు పై సత్య దేవ్ తబలా పై శివ రామ కృష్ణ పాడ్ పై నవీన్ హారి వాయిద్య సహకారం అందించారు ఈ సందర్భం గా జరిగిన సభా కార్యక్రమంలో ప్రముఖ సంగీత గురువు సంయుక్త పాల్గొని గాయనీ మణులు ను అభినందించి వారు చివరి పాట వరకూ గళం లో ఏ మాత్రం జీర లేకుండా ఆలపించటం విశేషం అన్నారు గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి మధు సూదన్ సంఖ్య శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ తమ అభిందనలు తెలిపారు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి చింతపట్ల వెంకటాచారి పన్నెండు గంటలు నిరాటంకం గా గానం చేసిన రాధ అరుణలకి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు ధ్రువ పత్రం అందజేసి సత్కరించారు లక్ష్మీ శాంతి సమన్వయ కర్త గా వ్యవహరించారు.

ముత్యాలమ్మ ఆలయంలో పూజలు

కుమ్మరిగూడ ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

అడ్డగుట్ట,డిసెంబర్ 2 ప్రభాతవార్త: మోండా డివిజన్ కుమ్మరిగూడలోని శ్రీ ముత్యాలమ్మ విగ్రహ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కార్పోరేటర్ కొంతం దీపిక ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ధర్మ సమాజ్ పార్టీ హిమాయత్‌నగర్ మండలం కార్యవర్గం

సైఫాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త:
ధర్మ సమాజ్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రాజ్‌కమల్ మహారాజ్ ఆధ్వర్వంలో మంగళవారం హిమాయత్‌నగర్ మండలం నూతన కమిటీ ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా పారనంది నర్సింగ్ రావు, ఉపాధ్యక్షుడిగా సంఘీపాగ మోహన్, ప్రధాన కార్యదర్శిగా ఏపూరి విక్రమ్‌బాబు, కోశాధికారిగా బోనకుర్తి వినోద్‌కు మార్, కార్యదర్శులుగా బొట్ల ప్రేమ్‌కుమార్, తుమ్మూరు సంతోష్, సభ్యులుగా భవాని మహారాణి, విజయ్‌కుమార్, నరేష్, నవీన్, మనోజ్‌యాదవ్, సింహారాజు, రాజుముదిరాజ్, సాయి రోహిత్ నియమితులైనారని అధ్యక్షుడు తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా సహకరించాలి

-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

హైదరాబాద్,డిసెంబరు 2,ప్రభాతవార్త:
ఏపీ మహేష్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నికలు సజావుగా సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు.ఏపీ మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ డైరెక్టర్ల ఎన్నికలు డిసెంబర్ 7న నిర్వహించనున్న సందర్భంగా పోటీ అభ్యర్థులతో ఎన్నికల విధివిధానాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు సి.పి తాఫ్సీర్ ఇక్బాల్, డిసిపి శిల్పవల్లి, డి ఆర్ వో ఈ వెంకటాచారి లతో కలసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో మొత్తం 37,000 మందికి పైగా ఓటర్లు బ్యాలెట్ విధానంలో తమ ఓటును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలైన మహారాష్ట్ర ముంబై, రాజస్థాన్లోని జైపూర్, బిల్వాడ , ఆంధ్రప్రదేశ్లోని విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు అలాగే తెలంగాణ హైదరాబాద్ తో పాటు ఖమ్మం, కరీంనగర్, వరంగల్ జిల్లాలలో ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. అలాగే హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, కమలా నెహ్రూ పాలిటెక్నిక్ , సరోజినీ దేవి వనిత మహా విద్యాలయం నాంపల్లి లో 68 పోలింగ్ కేంద్రాలు అలాగే మరో 10 పోలింగ్ కేంద్రాలు మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్ర ప్రదేశ్ తో పాటు తెలంగాణలోలోతెలంగాణ మూడు జిల్లాలలో జరగనున్నాయని తెలిపారు. పోటీ అభ్యర్థులు ఎన్నికల విధివిధానాలు తప్పక పాటించాలని అలాగే ఎన్నికలు సజావుగా సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ఆమె తెలిపారు. పోలింగ్ ఈ నెల 7 తేదీన ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు చేపట్టనున్నట్లు అలాగే ఓట్ల లెక్కింపు డిసెంబర్ 8 న జరుగుతుందని అదిశగా అన్ని ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఓటర్లను ప్రభావితం చేయడం, ప్రలోభాలు ఇవ్వడం, నకిలీ ఓటు వేయడం, అనుమతి లేని వస్తువులు తీసుకురావడం, రెండుసార్లు ఓటు వేయడానికి ప్రయత్నించడం, పోలింగ్ ప్రక్రియలో అంతరాయం కలిగించడం వంటి ఏదైనా అక్రమ చర్యలు జరిపితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.హైదరాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ పోలింగ్ స్టేషన్ల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144 అమలులో ఉంటుందని తెలిపారు. ఓటర్లు తప్పనిసరిగా తమ గుర్తింపు పత్రాలు తీసుకువచ్చి, అనుమతించని వస్తువులను పోలింగ్ కేంద్రాల్లోకి తీసుకురాకుండా విధినిర్వహణ సిబ్బందితో సహకరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఇంక్ పెన్నులు, వాటర్ బాటిల్స్, సెల్ ఫోన్స్ అనుమతి లేదనితెలిపారు. ఈ సమావేశంలో శిల్పవల్లి డీసీపీ, ఏసిపి పి.ప్రవీణ్, డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్ ప్రసన్న, పోటీ అభ్యర్థులు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి తదితరులు

4న కాకతీయం అభినయ ఉపన్యాసం : పద్మశ్రీ గ్రహీత డా. పద్మజారెడ్డి

రవీంద్రభారతి, డిసెంబరు 2 ప్రభాతవార్త : ప్రఖ్యాత కూచిపూడి నర్తకీమణి, నాట్యగురు, పద్మశ్రీ అవార్డునగ్రహీత డా. జి.పద్మజారెడ్డి పరిశోధించి రూపొందించిన కాకతీయం తెలంగాణ నాట్యం గ్రంథావిష్కరణ, అభినయ ఉపన్యాస కార్యక్రమం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఈ నెల 4న రాత్రి 6.30గంటల నుండి నిర్వహిస్తున్నట్లు జి.పద్మజారెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. తెలంగాణ రాష్ట్రమేర్పడిన తర్వాత రాష్ట్రానికి ప్రత్యేక నాట్యం ఉండాలనే ఉద్దేశ్యంతో గత పదేళ్లుగా వరంగల్ పరిసర ప్రాంతాల్లో దేవాలయాల శిల్పాలను, జాయప సేనాని రచించిన నృత్తరత్నావళితోపాటు పలు గ్రంథాలను పరిశోధించి నాట్య పండితులతో చర్చించి మేధేమథనం చేసి కాకతీయం నృత్యం తీర్చిదిద్దినట్లు ఆమె పేర్కొన్నారు. ఢిల్లీ నేషనల్ ట్రస్ట్ వారు ఈ గ్రంథాన్ని ప్రచురించినట్లు తెలిపారు. 4న గ్రంథావిష్కరణకు ముందు నాట్యరంగానికి చెందిన ప్రముఖుల ముందు తన పరిశోధనా వివరాలు విన్నవించనున్నట్లు చెప్పారు. అదే అంశాలను తన శిష్యబృందం ప్రదర్శించి చూపిస్తారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం, జయేష్‌రంజన్, యోగి తారాణా, బి.ఆచార్య, ఎంపి జితేందర్‌రెడ్డి, మాజీఎంపి పల్లంరాజు, శైలజాకిరణ్, పద్మశ్రీ శోభరాజు, సుశీల్‌రావు తదితరులు పాల్గొంటారని పద్మజారెడ్డి వివరించారు.

నాట్యగురు పద్మశ్రీ డా. జి.పద్మజారెడ్డి

ఎస్‌జీఎఫ్ఐ ఫుట్‌బాల్ టోర్నీకి జెహెచ్‌పిఎస్ జట్టు

జూబ్లీహిల్స్, డిసెంబరు 2, ప్రభాతవార్తః
హైదరాబాద్ ఫుట్‌బాల్ టోర్నీలో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ (జేహెచ్‌పీఎస్) విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) లో అండర్-14 జిల్లా స్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో మూడవ స్థానాన్ని దక్కించుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ కనకవల్లి తెలిపారు. తొమ్మిదో తరగతి చదువుతున్న ఎల్లూరు వెంకట ఇషాంత్ చౌదరి, ఎనిమిదో తరగతికి చెందిన విశ్రుత్ కడాడి జాతీయ స్కూల్ గేమ్స్‌కు ఎంపికయ్యారన్నారు. డిసెంబరు 1 నుండి 5 వరకు మధ్యప్రదేశ్‌లోని ఉమారియాలో జరగుతున్న స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా నిర్వహించే 69వ ఫుట్‌బాల్ టోర్నీలో రాష్ట్రం తరుపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో తప్పకుండా విజయాన్ని కైవసం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చినట్లు వివరించారు.

6న సాహితి విద్వన్మణి అత్తలూరి విజయలక్ష్మి సాహితి స్వర్ణోత్సవ మహోత్సవం

చిక్కడపల్లి డిసెంబర్ 2 ప్రభాతవార్త : వంశీ ఆర్ట్ థియేటర్స్, లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ కథా, నవలా, నాటక రచయిత్రి, స్వర్ణోత్సవ సాహితి విద్వన్మణి అత్తలూరి విజయ లక్ష్మి సాహితి స్వర్ణోత్సవ మహోత్సవంఅవార్డు ప్రధానం చేయబోతున్నారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలో డిసెంబర్ ఆరవ తేదీన సాహితీవేత్త డాక్టర్ పోలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ రమణ చారి హాజరై పురస్కారాన్ని ప్రధానం చేస్తారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.వి.రెడ్డి, సాహిత్య అకాడమీ కన్వీనర్ డాక్టర్ సి.మృణాళిని, ప్రముఖ సినీ దర్శకులు డాక్టర్ వి.ఎన్.ఆదిత్య, ఏపీ తెలుగు అకాడమీ చైర్మన్ శరత్ చంద్ర, సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ దీర్ఘాసి విజయ భాస్కర్, ప్రముఖ రంగస్థల నటులు రామకోటేశ్వర్ రావు తదితరులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వర్గీయ అత్తలూరి అనసూయ స్మారక పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల నటి బి.హెచ్.కళ్యాణి, డాక్టర్ రామకోటి రాఘవరావు స్మారక పురస్కారాన్ని ప్రముఖ పౌరాణిక నాటక కళాకారుడు మల్లాది రమణకు అందజేయనున్నారు. కాగా ఆ రోజు ఉదయం ప్రారంభోత్సవ సభను ప్రముఖ కవి డాక్టర్ ట్ .గౌరీ శంకర్ ప్రారంభిస్తారు. కార్యక్రమంలో డాక్టర్ ఆల్లూరి విజయలక్ష్మి, ప్రముఖ రచయిత జగన్నాథ శర్మ, పొత్తూరి విజయలక్ష్మి, శీలా సుభద్రాదేవి, డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొంటారు.అనంతరం జరిగే సాహితి సదస్సులో భాగంగా అత్తలూరి నాటకాలు, అత్తలూరి కథా సాహిత్యం, అత్తలూరి నావలా సాహిత్యం పైసదస్సు ఉంటుంది.సాయంత్రం సరసిజ థియేటర్ ఫర్‌విమెన్ ఆధ్వర్యంలో విజయలక్ష్మి రచించిన మహారాణి హాస్య నాటిక ప్రదర్శన ఉంటుంది.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
టెండరు ప్రకటన
క్ర.సం.1, నిట్ నం. 30/SE(M)/CRZ/GHMC/2025-26, తేదీ: 01.12.2025
పని పేరు: 09 సం. సివిల్ పని. అంచనా మొత్తం (రూ.లక్షలలో): 1074.70, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 03.12.2025, సా.05.00 గం. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ, సమయం: 10.12.2025, మ.3.30 గం. మొత్తం: సివిల్ పని యొక్క 09 సం.-రూ.1074.70. అధికారి పేరు, చిరునామా & సెల్ నం: శ్రీ బి. సరేందర్ గౌడ్, సూపరింటెండింగ్ ఇంజనీర్, చార్మినార్ జోన్, GHMC, పూల్‌బాగ్, బాబాసగర్, ఫోన్: 9989930608. తదుపరి వివరాలను https://tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (M), చార్మినార్ జోన్, GHMC
DIPR.No.11624-PP/CL/Advt/1/2025-26, తేదీ: 02.12.2025

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
నిట్ నం. 48. పని పేరు: GHMC, సర్కిల్-11, రాజేంద్రనగర్‌లో CC రోడ్ వగైరా వేయుట, CC/BT స్టాక్‌లు వేయుట యొక్క 6 నం. పనుల కొరకు. అంచనా మొత్తం/ECV: రూ.120.75 లక్షలు. డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ & సమయం: 04.12.2025 మ.2.30 గం. వద్ద. బిడ్ స్వీకరణకు చివరి తేదీ & సమయం: 12.12.2025 మ.2.45 గం. వద్ద. EE/SE యొక్క పేరు, చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రాజేంద్రనగర్, డివిజన్ నం.11, GHMC, సెల్ నం.9989930608. ఇ-మెయిల్ ID: eec11.ghmc2@gmail.com.
సం/- ఎగ్జిక్య

ఘనంగా ప్రారంభమైన దత్తాత్రేయ జయంతి మహోత్సవాలు

పూజలు నిర్వహిస్తున్న ప్రసాదరావు దంపతులు

సైదాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మీనగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం దత్తాత్రేయ జయంతి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం బాబాకు పాలాభిషేకము అనంతరం గణపతి పూజ, పుణ్యాహవాచన, రక్షాబంధన, అఖండ దీపారాధన, మండప దీపారాధనను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. ఈ నెల 3వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుండి సాయి దత్త హోమం, లక్ష్మి గణపతి హోమం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, 4వ తేది గురువారం దత్త జయంతి సందర్భంగా ఉదయం 8 గంటల నుండి 58 కళశములతో దత్తాత్రేయ స్వరూప సాయినాథుడికి క్షీరాభిషేకము, ఉదయం 10 గంటలకు అనఘాష్టమి దేవి వ్రతము, రాత్రి 7 గంటలకు బాబా వారి రథోత్సవము నిర్వహించబడుతుందని దేవాలయ కమిటీ ప్రతినిధులు నేరెళ్ల ప్రసాదరావు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాలలో పాల్గొని బాబా కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

అందెశ్రీ,హెడ్మాల త్యాగం వెలకట్టలేనిది

-బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు రాధాకృష్ణ

కార్యక్రమంలో మాట్లాడుతున్న నల్లా రాధా కృష్ణ తదితరులు

నాచారం, డిసెంబర్ 2 ప్రభాతవార్త : ప్రముఖ కవి అందే శ్రీ సమాజ ఉద్ధరణ కోసం ఎన్నో పాటలు రాస్తే కామ్రేడ్ హిడ్మా ఆదివాసీ ప్రజల హక్కుల కోసం ప్రాణ త్యాగం చేసిన మహా వీరుడని బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధా కృష్ణ పేర్కొన్నారు. బహుజన సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో నాచారంలోని భహుజన సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో అందెశ్రీ, హిడ్మాల సంస్కరణ సభను నిర్వహించారు. తెలంగాణ ఉద్యమ నాయకులు, చైర్మన్ కుసుకుంట్ల విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నల్లా రాధాకృష్ణ వారి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అందె శ్రీ, హెడ్మాల త్యాగం గూరించి కొని యాడారు. ఈ కార్యక్రంలో నాచారం ఇంటలెక్షువల్ ఫోరమ్ కన్వీనగర్ ప్రేమ్ కుమార్, మైనార్టీ జేఏసీ కన్వీనర్ ఎండి.రజాక్, దళిత సంఘాల జేఏసీ కన్వీనర్ వెంకటేశ్వర్లు, మల్లాపూర్ ఎలక్షన్ మన్నెనర్సింగహ్య,ఉడ్డి, మన్నె నర్సిహ్మరెడ్డి, సమలం జ్యోతి, బడిద గనేష్, జీవన రాజు,గద్ద ముగందర్, నీతల వెంకటయ్య, మత్కల్ అశోక్, ఎచ్, విష్ణు, కనక, షాషిన్ సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్‌లోని విద్యుత్ లైన్ల సమస్యలు పరిష్కరించండి : అజయ్ యాదవ్

హబ్సిగూడ డివిజన్ ఎస్ఈ వెంకన్నను సన్మానిస్తున్న మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ , కొత్త కిషోర్ గౌడ్

బోడుప్పల్, డిసెంబర్ 2 ప్రభాతవార్త ; బోడుప్పల్ లో నూతన రహదారులపై నిలిచిపోయిన విద్యుత్ లైన్ల ,ఫోల్లు పరిష్కారం పై టిజిఎస్ పిడిసిఎల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బోడుప్పల్ మున్సిపల్ కార్పోరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ తో అధికారుల బృందం హబ్సిగూడ డివిజన్ టిజిఎస్ పిడిసిఎల్ ఎస్ఈ వెంకన్న ని కలిసి వినతిపత్రం అందజేశారు . ఈ సంధర్భంగా మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ... బంగారు మైసమ్మ దేవాలయం నుంచి చెంగిచర్ల రోడ్ వరకూ ఉన్న విద్యుత్ లైన్ల , స్తంభాల మార్పిడి వంటి అంశాలతో పాటు అంబేడ్కర్ విగ్రహం నుంచి చిలుకనగర్ రోడ్ వరకు విద్యుత్ లైన్ల పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉండటంతో రహదారి మధ్యలో విద్యుత్ ఫోల్లు, లైన్లను ఉండడం వలన ప్రజలు తీవ్ర అసౌకర్యం ఎదుర్కొంటున్నారని వెంటనే పనులు పూర్తయ్యేలా చూడాలని కోరారు.

నియామకం పత్రం అందుకున్న వజ్రేష్ యాదవ్

పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్,ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న మేడ్చల్ జిల్లా నూతన అధ్యక్షుడు తోటకూర వజ్రేష్

బోడుప్పల్, డిసెంబర్ 2 ప్రభాతవార్త: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుండి బలోపేతం చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన తోటకూర వజ్రేష్ యాదవ్‌కు మంగళవారం నియామకం పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్‌లు మాట్లాడుతూ .. రాబోయే గ్రేటర్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించేలా ఇప్పటి నుండే పార్టీని బుత్ స్థాయి నుండి బలోపే తం చేయడానికి కృషి చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసు కుపోయేలా కార్యకర్తలను సమాయత్తం చేయాలని తెలిపారు. అనంతరం వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ...అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పార్టీని జిల్లాలో బలమైన శక్తిగా తీర్చిద్దుతానని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖార్గే, పార్లమెంటరి నాయకుడు రాహుల్ గాంధీ,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు .

ప్రజలు నైతిక విలువలు పెంపొందించుకోవాలి

-ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అజిజుర్ రెహమాన్

మలక్ పేట, డిసెంబర్ 2, ప్రభాతవార్త: ప్రజలు నైతిక విలువలను పెంపొందించుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ఖురాన్ తెలుగు అనువాదకర్త అజీజుర్ రెహమాన్ పేర్కొన్నారు. జమాఅతె ఇస్లామీ హింద్ మలక్ పేట్ శాఖ ఆధ్వర్యంలో మలక్ పేట్ ఆఫీసర్స్ మెస్ లో "ఆదర్శ పొరుగు ఆదర్శ సమాజం" అనే అంశంపై సర్వ మత సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...నేటి సమాజంలో మనుషుల మధ్య నెలకొన్న దూరాలను రూపుమాపి సౌభ్రాతృత, సోదరభావాన్ని బలోపేతం చేయాల్సిన చారిత్రక అవసరం ఏర్పడిందన్నారు. నేటి ఆధునిక సమాజం లో ఏళ్ల తరబడి ఒకే అపార్ట్మెంట్లో ఉంటున్నా ఒకరినొకరు గుర్తు పట్టలేని పరిస్థితి నెలకొందని చెప్పారు.ఇరుగుపొరుగు వారు ఒకరికొకరు రక్షణ కవచంలా ఉండాలని, అంతే కాని ప్రైవసీ పేరుతో కన్నతల్లి దండ్రులతో కూడా దూరాలు పెంచుకుంటున్నారని, ఇరుగు పొరుగు వారితో పరస్పర సహకారం, స్నేహ బంధాలు కొరవడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎవరికి వారు మనం ఎంత మంచి ఇరుగు పొరుగు వారమనే విషయం గురించి ఆత్మపరిశీలన చేసుకోవాలని అభిప్రాయపడ్డారు. ఇరుగు పొరుగువారు ఆకలితో బాధపడుతుంటే మనం మాత్రం కడుపు నిండా తినడం విశ్వాసి లక్షణం కాదనే ఖురాన్ సూక్తిని అలవర్చుకోవాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షోపన్యాసం చేసిన సలీమ్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ మంచి ఇరుగు పొరుగు వారి వల్ల మంచి సమాజం ఏర్పడుతుందని, మంచి సమాజం వల్ల మంచి దేశం ఏర్పడుతుందని, అందుకే మనం మంచి ఇరుగు పొరుగు వారిగా మారాలని సూచించారు. అందుకే జమాఅతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఖిఆదర్శ పొరుగు ఆదర్శ సమాజంఖి అనే ఇతివృత్తంపై సర్వమత సదస్సును నిర్వహించడం జరిగిందని వివరించారు. అదేవిధంగా జమాఅత్ స్థానిక అధ్యక్షుడు ముజీబుల్ ఆలా, ఆర్యసమాజ్ ప్రతినిధి విఠల్ రావు ఆర్య, వివిధ మత సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు దానకర్ణ చారి, జి.శ్రవణ్ కుమార్ పురోహిత్, సాయిచైతన్య జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సురేశ్ బాబు, జాన్ మోజెస్, రమేశ్ వీరబొమ్మ, ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వై.జనార్ధనెడ్డి, అడ్వకేట్ సుభాషిణి ప్రసంగించారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న సాయి చైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు, చిత్రంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మహమ్మద్ అజీజూర్ రహమాన్, ముజిబుల్ ఆలా తదితరులు

చెరువుల పరిరక్షణ కోసం ప్రత్యేక దృష్టి : అరుణాసురందర్ యాదవ్

ఎల్.బి.నగర్, డిసెంబర్ 2 ప్రభాతవార్త: గుర్రపు డెక్క తొలగింపు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి చెరువులను సంరక్షిస్తున్నట్లు నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ పేర్కొన్నారు.నాగోల్ డివిజన్ పరిధిలో ప్రజల ఆరోగ్యం, పర్యావరణ సంరక్షణ, చెరువుల పునరుజ్జీవనాన్ని ముఖ్య లక్ష్యంగా తీసుకుని చేపట్టిన చెరువుల శుభ్రత,గుర్రపు డెక్క తొలగింపు ప్రత్యేక డ్రైవ్ ను మంగళవారం బండ్లగూడ చెరువులో కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ..చెరువులో జరుగుతున్న శుభ్రత కార్యక్రమాలు, నీటి నాణ్యత, నీటి మట్టం, చెరువు లోపల పెరిగిన గుర్రపు డెక్కల వల్ల దొమల పెరుగుదల, ఆంటీ లార్వా సమస్యలను పరిష్కరించేందుకు అధికారుల అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కలు, పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్, చెత్త పూర్తిగా తొలగించి చెరువును పునరుద్ధరించాలని, చెరువు చుట్టుపక్కల తుమ్మ మొక్కలు, జుల్లమొగ్గలు, దొమల పెరుగుదలకు కారణమయ్యే పిచ్చిమొక్కలను పూర్తిగా తొలగించాలన్నారు. నీటిలో ఆంటీ లార్వా ఆపరేషన్స్ ను వెంటనే ప్రారంభించాలన్నారు. పరిసరాల్లో ఫాగింగ్ డ్రైవ్‌ను ప్రతిరోజూ నిర్వహించాలని, చెరువు వద్ద పర్యావరణ పరిరక్షణ కోసం క్యాంపోస్టింగ్ యూనిట్, గార్బేజ్ బిన్‌ల ఏర్పాటు చేయాలని సూచించారు. కాలనీవాసులకు చెరువు వద్ద చెత్త వేయకూడదని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. చెరువు చుట్టూ వాకింగ్‌ట్రాక్, గ్రీన్‌కవర్ పెంపు, లైటింగ్ సౌకర్యాలు వంటి పౌర వసతులను దశలవారీగా అభివృద్ధి చేయాలన్నారు. చెరువులు మన ఊపిరితిత్తులని, పర్యావరణాన్ని శుభ్రంగా ఉంచడం, భూగర్భ జలాలను సమృద్ధిగా పెంచుతాయని, చెరువులు ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. చెరువుల సంరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కార్పొరేటర్ విజ్ఞప్తి చేశారు. చెరువు పునరుద్ధరణ స్పెషల్ డ్రైవ్ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, ప్రతి వారం చెరువుల పరిస్థితిని స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ జనార్ధన్, సిబ్బంది, నాయకులు, కాలనీ సబ్యులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న చింతల అరుణసురేందర్‌యాదవ్

యాప్రాల్ రాఘవ కళ్యాణ్ ఎస్టేట్స్‌లో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

-పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు

నేరెడ్ మెట్ యాప్రాల్, డిసెంబర్ 2,ప్రభాతవార్త : రాఘవ కళ్యాణ్ ఎస్టేట్స్ మెయిన్ రోడ్డులో డ్రైనేజీ సమస్య రోజురోజుకీ తీవ్రమవుతూ స్థానికుల జీవితాలను సవాలు చేస్తోంది. రహదారి మధ్యలో ఉన్న మాన్‌హోల్ మూత నుంచి మురుగునీరు నిరంతరం పొంగిపొర్లుతూ రోడ్డు మొత్తం దుర్వాసన, చెత్తతో నిండిపోగా, ప్రజా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడంతో నివాసితుల్లో అసహనం పెరిగింది. వర్షం లేకున్నా నీరు నిలిచిపోవడంతో దోమల పెరుగుదల, ఆరోగ్య సమస్యల భయం పెరగిందని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పిల్లలు, వృద్ధులు రోజూ ప్రయాణంలో ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన వల్ల అస్వస్థతకు గురవుతున్నాం" అని కాలనీవాసులు వెల్లడించారు. మురుగునీటి ప్రవాహం కారణంగా రెండు చక్రాల వాహనదారులు జారి పడే ప్రమాదంలో ఉన్నారని, రాత్రివేళ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని చెప్పారు.స్థితిగతులను అధికారులు ప్రత్యక్షంగా వచ్చి పరిశీలించాలని, మాన్‌హోల్ మరమ్మతులు, డ్రైనేజీ లైన్ శుభ్రత తక్షణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతున్నా జి.హెచ్.ఎంసీ స్పందన లేకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.ఇప్పటికైనా సమస్యను పట్టించుకోకపోతే, తీవ్ర ఉద్యమానికి దిగుతాం" అని కాలనీవాసులు హెచ్చరించారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకోకపోతే పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.

అనాథాశ్రమ నిర్మాణానికి సబితా ఇంద్రారెడ్డి విరాళం

సరూర్‌నగర్, డిసెంబర్ 2 ప్రభాతవార్త: అనాథలు, అభాగ్యుల పట్ల మాజీ మంత్రి, అసెంబ్లీలో సీనియర్ శాసన సభ్యురాలు, ప్రస్తుత మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి మానవత్వం చాటుకున్నారు. ఎమ్మెల్యేగా తనకు వచ్చే రూ.3 లక్షల వేతనాన్ని నాదర్‌గుల్‌లో మాతృదేవోభవ అనాథాశ్రమానికి సంబంధించిన స్వంత భవన నిర్మాణానికి విరాళంగా అందజేసి స్ఫూర్తిగా నిలిచారు. మతిస్థిమితం లేకుండా రోడ్లపై దుర్భర స్థితిలో తిరిగే అనాథలు, అభాగ్యులను ఆదరించి వారికి ఆశ్రయం కల్పించి వసతి, భోజనం, వైద్యం తదితర సదుపాయాలను కల్పిస్తున్న మాతృదేవోభవ ఆశ్రమం అందిస్తున్న సేవలను గుర్తించిన ఆమె తన వంతు తోడ్పాటునందించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమె స్వయంగా అనాథాశ్రమ భవన నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి అక్కడి స్థితిగతులను పరిశీలించారు. ఈ మేరకు రూ.3 లక్షల చెక్కును మాతృదేవోభవ అనాథాశ్రమ వ్యవస్థాపకుడు గట్టు గిరికి అందజేశారు. ఆ తర్వాత ఆమె ఆశ్రమ నిర్మాణానికి భూమి పూజ చేశారు.

సమాజానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు అవసరం: సబితారెడ్డి

నేటి సమాజంలో అనాథలను, అభాగ్యులను ఆదరించి సేవా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసం ఉందని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆశ్రమ నిర్మాణానికి భూమి పూజ చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ మాతృ దేవోభవ ఆశ్రమం అందిస్తున్న సేవలు గొప్పవని అన్నారు. మంచి ఉద్దేశ్యంతో తలపెట్టిన ఆశ్రమ నిర్మాణం త్వరితగతిన పూర్తి కావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ సొసైటీ మాజీ ఛైర్మన్, పిఐసి డైరెక్టర్ మర్రి నర్సింహా రెడ్డి, పిఐసి డైరెక్టర్ యెల్చల సుదర్శన్‌రెడ్డి, బడంగ్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, బిఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్, మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, నాయకులు కోటగిరి జంయ్య, బొద్రమోని శ్రీరాములు ముదిరాజ్, నరేష్ చారి, విజయ్, సుధాకర్ యాదవ్, పెంటయ్య, తోట జంగారెడ్డి, దండు యాదయ్య, పెద్దబావి మహేందర్‌రెడ్డి, జమాల్‌పూర్ సునీతా బాలరాజ్, మాదరి రమేష్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లతో పాటు పలువురు పాల్గొన్నారు.

అనాథాశ్రమ నిర్మాణానికి తన వంతుగా రూ.3 లక్షల చెక్కును అందజేస్తున్న సబితా ఇంద్రారెడ్డి

అనాథ విద్యాగృహానికి చేయూత

విద్యార్థులకు వస్తువులు అందజేస్తున్న దృశ్యం

ఎల్.బి.నగర్, డిసెంబర్ 2 ప్రభాతవార్త: అనాథ విద్యార్థి గృహంలోని విద్యార్థులకు రాక్‌టౌన్ రెసిడెన్స్‌కాలనీలోని జిడి జియోని స్కూల్ విద్యార్థులు సేకరించిన నగదుతో అనాథ విద్యార్థి గృహానికి అవసరమైన వంట సామాగ్రిని అందజేశారు. నాగోల్‌లోని వాత్సల్యం ఫౌండేషన్ ఆశ్రమంలోని విద్యార్థులకు చేయూతను ఇవ్వడంలో భాగంగా విద్యార్థులకు కావలసిన వస్తువులను పంపిణీ చేయడం పట్ల వాత్సల్యం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాఘవేందర్ కృతజ్ఞతలు తెలిపారు. అనాథ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారికి చేయూతను అందించిన వారిని ఆదర్శంగా తీసుకుని ఆశ్రమం విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. మిగతా పాఠశాలు, పాఠశాల విద్యార్థులు కూడా అదే బాటలో నడవాలని విజ్ఞప్తి చేశారు. దశాబ్ద కాలానికి పైగా వేలాదిమంది విద్యార్థులను చేరదీసి వారికి ఎంతోమంది దాతల సహాయ సహకారాలతో బంగారు భవిష్యత్తు అందిస్తున్నామని సహకరించేందుకు దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

అంజనేయస్వామి ఆలయ కమిటి అధ్యక్షునిగా కొండ్రు హనుమంతు

స్వయంభు శ్రీ ఆంజనేయస్వామి ఆలయ కమిటి చైర్మన్‌గా ఎన్నికైన కొండ్రు హనుమంతును సత్కరిస్తున్న ఆలయ కమిటి నేతలు

ఉప్పల్, డిసెంబరు 2 ప్రభాతవార్త : ఉప్పల్ గణేష్‌నగర్‌లోని స్వయంభు సంజీవిని అంజనేయస్వామి దేవాలయం కమిటి చైర్మన్‌గా కొండ్రు హనుమంతు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ మేరకు మంగళవారం జరిగిన సమావేశంలో కొత్త అధ్యక్షున్ని ఎన్నుకుంటూ తీర్మానించారు. ఆలయ కమిటి చైర్మన్ కొండ్రు హనుమంతు మాట్లాడుతూ స్వయంభు శ్రీ అంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి తమ వంతు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఆలయం అభివృద్ధిలో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని సూచించారు. కాగా ఆలయ కమిటి ఎన్నికల అధికారులుగా ఆర్.వెంకటేశ్వరరావు, ఎ.మెహన్‌రాజా, ఎన్.రమేష్ వ్యవహరిస్తారించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ కొండ్రు హనుమంతు,వైస్ చైర్మన్‌గా సురివి సత్యపాలిరెడ్డి, వేముల సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలకు కొత్త టీచర్ల కేటాయింపు

చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమైన కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

ఉప్పల్, డిసెంబరు 2 ప్రభాతవార్త : చిలుకానగర్ డివిజన్ ప్రభుత్వ పాఠశాలకు మరో నలుగురు కొత్త ఉపాధ్యాయులను కేటాయించారని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులతో కలిసి ఆమె సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయుల కొరతపై ప్రిన్సిపల్ అంజిరెడ్డి సమాచారంతో జిల్లా విద్యాశాఖ అధికారి విజయ లక్ష్మికి విన్నవించగా ఆమె వెంటనే స్పందించి కొత్తగా ఉపాధ్యాయులను కేటాయించారని తెలిపారు. కొత్త టీచర్లను ఏర్పాటు చేసి పిల్లల చదువుకు ఇబ్బంది కలగకుండా చూడాలని చెప్పడంతో వెంటనే స్పందించారని తెలిపారు.నలుగురిని డిప్యూటేషన్‌పై కేటాయించారని తెలిపారు.సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటం

హయత్ నగర్, డిసెంబర్ 2 ప్రభాతవార్త : హయత్ నగర్ డివిజన్ పరిధిలోని లక్షిప్రియ కాలనీ, దుర్గానగర్, వెంకటేశ్వర కాలనీ, టీఎన్ ఎన్టీ కాలనీ, గరుడ నగర్, శివాజి కాలనీ, బృందావన్ కాలనీ, మిత్రనగర్, లక్ష్మీగణపతి కాలనీల దీర్ఘకాళిక సమస్యల పరిష్కారం కోసం కాలనీల ప్రతినిధులు జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడ్డారు.తొమ్మిది కాలనీల జేఏసీ అధ్యక్షుడిగా భోజ యాదగిరి గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సట్టు నాగయ్య, కోశాధికారిగా వరకాంతం నర్సిరెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్యామకూరి శ్రీనివాస్ గౌడ్, నూనె ముంతల రవిగౌడ్, జాయింట్ సెక్రెటరీ గా వంగాల అచ్చి రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శిగా కె. జయకృష్ణ, సలహాదరుడిగా పీసరి శ్రీకాంత్‌రెడ్డిలు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జేఏసీ ఆధ్వర్యంలో సమస్యలను ప్రజా ప్రతినిధులు అధికారులకు వివరించి వాటి పరిష్కారం కోసం పోరాడతామన్నారు.

బాస్కెట్‌బాల్‌లో మేడ్చల్ మల్కాజిగిరి బాలికల విజయం

నేరెడ్ మెట్, డిసెంబర్ 2,ప్రభాతవార్త : సంగారెడ్డిలో మూడు రోజుల పాటు జరిగిన 11వ సీనియర్ ఇంటర్‌డిస్ట్రిక్ట్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో మేడ్చల్ మల్కాజిగిరి బాలికల జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఉత్కంఠభరిత ఫైనల్‌లో హైదరాబాద్‌పై 6159 స్కోరుతో గెలిచింది. మ్యాచ్ చివరి క్షణాల్లో వేసిన కీలక బాస్కెట్ జట్టుకు విజయాన్ని కట్టిపడేసింది.ఈ టోర్నీలో మొత్తం 14 జిల్లాల జట్లు పోటీపడ్డాయి. మూడోస్థానంలో రంగారెడ్డి నిలిచింది. బాలుర విభాగంలో హైదరాబాద్ విజేతగా నిలువగా, రన్నరప్‌గా రంగారెడ్డి, మూడోస్థానంలో మేడ్చల్ మల్కాజిగిరి నిలిచింది.మేడ్చల్ తరఫున ఆడిన విహ్వా రెడ్డి, నేత్ర భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం విశేషంగా నిలిచింది. జట్టును అభినందించిన అసోసియేషన్ అధ్యక్షులు సుధీర్, ప్రధాన కార్యదర్శి రవిశంకర్ భవిష్యత్‌లో మరిన్ని ఛాంపియన్‌షిప్‌లు సాధించాలని ఆకాంక్షించారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీకి సత్కారం



నూతన కమిటీని సన్మానిస్తున్న చిలుక నరసింహారెడ్డి, చిలుక ఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, డిసెంబర్ 2 ప్రభాతవార్త: ఆర్కేపురం డివిజన్ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జరిగిన ఆర్యవైశ్య ఎన్నికలలో డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన ఉప్పల బాలస్వామి, ప్రధానకార్యదర్శిగా భవనాశి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షులు చిలుక నరసింహారెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డిలు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించకుండా ఏకగ్రీవంగా నూతన కమిటీ సబ్యులకు శుభాకాంక్షలు. ఆర్యవైశ్యులు సమాజానికి మంచి సేవకులన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు తాడేపల్లి వెంకటేశం, ఆర్కేపురం శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం మాజీ చైర్మన్ జగిని రమేష్, సంఘం సబ్యులు మంచుకొండ సైదయ్య, బ్రాహ్మణపల్లి రాములు, గుండా రామకోటి, శ్రీనివాస్, ఉప్పల సోమనాదం, రామారావు, మురళి, జగిని సోమయ్య, పోలా జనార్ధర్, రాజేశ్రీ రామారావు, జి.సత్యనారాయణ, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్ కాలనీలో అభివృద్ధి పనులు : శ్రీవాణి

రామంతాపూర్ నెహ్